97 వేల కోట్ల ఆస్తి తోటమాలికి!

నికోలస్ ఫ్యూచ్

పారిస్, డిసెంబర్ 9: స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ బిలియనీర్, లగ్జరీ ఫ్యాషన్ హౌస్ హెర్మ్స్ వ్యవస్థాపకుడు థైరీ హెర్మ్స్ మనువడు నికోలస్ ఫ్యూచ్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. 51 ఏండ్ల మాజీ తోటమాలిని దత్తత తీసుకుని అతనికి 1100 కోట్ల డాలర్ల (రూ.97 వేల కోట్లు) సంపదను అప్పగించాలని నిర్ణయించారు. స్విస్‌కు చెందిన 'ట్రిబ్యూన్' వెలువరించిన కథనం ప్రకారం థైరీ హెర్మ్స్‌కు ఐదవతరం వాడైన 80 ఏండ్ల నికోలస్ ఫ్యూచ్ అవివాహితుడు, సంతానం లేదు. వారసత్వంగా సంక్రమించిన హెర్మ్స్‌లో అతనికి ఐదు నుంచి పది శాతం వాటా ఉంది. దీంతో ఆయన తన మాజీ తోటమాలి (పేరు వెల్లడించ లేదు)ని తన వారసుడిగా దత్తత తీసుకుని అతనికి ఆస్తిని రాయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన న్యాయ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఇప్పటికే నికోలస్ మొరాకో, మర్రకేష్‌ల్లోని ఆస్తులను, మాంట్రెక్స్, స్విట్జర్లాండ్‌లలో మిలియన్ డాలర్లు విలువ చేసే విల్లాలను తోటమాలికి అప్పగించినట్టు ట్రిబ్యూన్ వెల్లడించింది.

ఒక్క రక్త పరీక్షతో రోగాల గుట్టు రట్టు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఆరోగ్య సమస్యలను త్వరగా గుర్తించడానికి రక్త పరీక్ష దోహదపడుతుంది. ఇదే పరీక్షతో మానవ అవయవాల వయస్సును, చాలా ముందుగానే భవిష్యత్తు అనారోగ్యానికి సంబంధించిన ఆధారాలు కనుగొనవచ్చని నిరూపించారు కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు. వీరి నేతృత్వంలోని పరిశోధకులు మానవ రక్తంలో ప్రొటీన్ స్థాయిలను విశ్లేషించారు. రక్త పరీక్ష ద్వారా శరీరంలోని అవయవాల జీవ సంబంధమైన వయస్సును నిర్ధారించవచ్చని వీరు చెబుతున్నారు. అనారోగ్యానికి గురయ్యే ముందే చికిత్స చేసేందుకు ఈ విధమైన రక్త పరీక్ష దోహదం చేస్తుందని తెలిపారు. అంతే కాకుండా అల్జీమర్స్ లాంటి వ్యాధులను ముందుగానే అంచనా వేయవచ్చని, వ్యాధి పురోగతి తీవ్రతను అంచనా వేయవచ్చని చెబుతున్నారు. ఈ నూతన రక్త పరీక్ష ద్వారా ముందుగానే అవయవాల (అనారోగ్య) క్లినికల్ లక్షణాలు తెలుసుకుని చికిత్సను అందించే వీలవుతుందని పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు.

కంటిలో 60 చిన్నపురుగులు



న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా బతికున్న 60 చిన్న పురుగులు. అదీ కూడా కంటి నుంచి బయటపడ్డాయంటే తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. చైనాలో ఈ ఘటన చోటు చేసుకుంది. 'మిర్రర్' కథనం ప్రకారం ఒక గుర్తు తెలియని మహిళ ఇటీవల కండ్ల దురదతో ఇబ్బంది పడుతున్నది. దీంతో కంటిని నులుముకోగా ఒక పురుగు బయటపడటంతో బెంబేలెత్తిన ఆమె కన్‌మింగ్‌లో ఉన్న ఒక దవాఖానకు వెళ్లగా డాక్టర్లు పరీక్షించి కంటికి శస్త్ర చికిత్స చేశారు. ఆపరేషన్ సమయంలో జీవించి ఉన్న ఒక్కో పురుగు ఆమె కండ్లలో నుంచి బయటపడుతుండటంతో డాక్టర్లు ఆశ్చర్యపోయారు. చివరకు ఆమె రెండు కళ్లలోంచి జీవించి ఉన్న 60 సూక్ష్మమైన పురుగులను వెలికి తీసినట్టు తెలిపారు. కనుగుడ్డు, కనురెప్ప మధ్యన ఈ జీవులు తిష్ట వేసినట్టు వారు చెప్పారు. ఫిలరియోడియా అనే ఏలికపాముల ద్వారా ఈ వ్యాధి సోకే ఉంటుందని, సాధారణంగా ఇది ఈగ కాటు ద్వారా వ్యాపిస్తుందని ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన డాక్టర్ గువాన్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 1.17 కోట్ల కేసుల పరిష్కారం

తెలంగాణలో 30న నిర్వహణ

న్యూఢిల్లీ : ఈ ఏడాది నిర్వహించిన నాలుగో జాతీయ లోక్ అదాలత్‌లో ఇప్పటివరకు 1.17 కోట్ల కేసులను పరిష్కరించారు. వీటిలో 11.98 లక్షల పెండింగ్ కేసులు కూడా ఉన్నాయి. జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారుల డబ్బు, సమయం ఆదా కావడమే కాక, న్యాయ వ్యవస్థపై భారం కూడా తగ్గింది. నల్సా ఆధ్వర్యంలో దేశంలోని 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జాతీయ లోక్ అదాలత్ సేవలందిస్తున్నది. జాతీయ లోక్ అదాలత్ ద్వారా పలు పెండింగ్ కేసులు పరిష్కారమవుతున్నాయని నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ తెలిపారు. అయితే కొన్ని పాలనాపరమైన కారణాల వల్ల నాలుగో లోక్ అదాలత్ ఢిల్లీలో ఈ నెల 10న, ఛత్తీస్‌గఢ్‌లో 16న, తెలంగాణలో 30న నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో లక్షలాది పోక్సో కేసులు పెండింగ్

న్యూఢిల్లీ : బాలలపై లైంగిక నేరాల కేసులు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో లక్షలాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త కేసులు నమోదు కాకుండా, కనీసం వీటిని పరిష్కరించాలన్నా తొమ్మిదేండ్లు పడుతుంది. అరుణాచల్ ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో పెండింగ్ కేసుల పరిష్కారానికి కనీసం 25 ఏండ్లు పడుతుందని ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐసీపీటీ) నివేదిక వెల్లడించింది. 2023 జనవరి 31నాటికి ఈ కోర్టుల్లో 2,43,237 పోక్సో కేసులు నమోదైనట్లు తెలిపింది. కోర్టుల్లో కేసు నమోదైనప్పటి నుంచి ఒక ఏడాదిలోగా విచారణను ముగించి, దోషులను శిక్షించాలి. అయితే ఈ కోర్టుల్లో మొత్తం కేసులు 2,68,038 కాగా, వీటిలో కేవలం 8,909 కేసుల్లో మాత్రమే దోషిత్వ నిర్ధరణ జరిగిందని ఐసీపీటీ తెలిపింది.

44 చోట్ల ఎన్ఐఏ దాడులు

ముంబై, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ: ఉగ్రవాద సంస్థ ఐసిస్ అణచివేత కోసం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు శనివారం మహారాష్ట్ర, కర్ణాటకలోని 44 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఐసిస్ మాడ్యూల్ నేత సాకిబ్ నాచన్‌తోపాటు ఐసిస్‌తో సంబంధాలు ఉన్న 15 మందిని అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని థానే, పుణే జిల్లాలతోపాటు కర్ణాటకలోని బెంగళూరులో శనివారం ఉదయం నుంచి ఈ దాడులు నిర్వహించినట్టు ఎన్ఐఏ అధికారి ఒకరు వెల్లడించారు. ఒక్క థానే జిల్లాలో 41 చోట్ల సోదాలు జరిగాయి. దాడుల్లో పెద్దయెత్తున నగదు, ఆయుధాలు, స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నామని అధికారులు వెల్లడించారు.

ఇంకా తేలని సీఎం అభ్యర్థులు!

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చి దాదాపు వారం గడిచింది. ఈ మూడు రాష్ట్రాల్లో కొత్త ముఖ్యమంత్రులు ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉన్నది. మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, కైలాశ్ విజయ్‌వర్గీయ పేర్లను బీజేపీ పరిశీలిస్తున్నట్టు తెలిసింది. రాజస్థాన్ సీఎం రేసులో తాను లేనని బీజేపీ ఎమ్మెల్యే బాబా బాలక్‌నాథ్ ప్రకటించారు. మాజీ సీఎం వసుంధరా రాజే, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ మేఘ్వాల్, దియా పేర్లు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో మాజీ సీఎం రమణ్ సింగ్, రామ్‌విచ్చర్ నేతమ్, సరోజ్ పాండే, రేణుకా సింగ్ వంటి వాళ్లు సీఎం పదవి కోసం ప్రధానంగా పోటీపడుతున్నారు.

మిజోరంలో ఎమ్మెల్యేలకు పాత కార్లే

ఐజ్వాల్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మిజోరం సీఎం లాల్‌దుహోమా కీలక నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు కొత్త కార్లు ఇవ్వటం లేదని, పాత కార్లే వాడుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ విధానానికి అనుగుణంగా మంత్రులు, వివిధ శాఖల ఉద్యోగులు నడుచుకోవాలని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఎమ్మెల్యేల కార్లు కొనుగోలుకు నిధులు విడుదల చేయటం లేదు. కొత్త ప్రభుత్వంలోని మంత్రులకు కూడా ఇదే వర్తిస్తుంది. పాత మంత్రులు వాడిన వాహనాల్నే కొత్త మంత్రులకు ఇస్తాం' అని అన్నారు.

వేలి ముద్రలు ఇవ్వకున్నా ఐరిస్‌తో ఆధార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ఆధార్ నమోదుకు అర్హత ఉన్న ఎవరైనా వారి చేతి ముద్రలు అందించలేకపోతే ఐరిస్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని కేంద్రం శనివారం ప్రకటించింది. తనకు చేతి వేళ్లు లేని కారణంగా ఆధార్‌లో పేరు నమోదు చేయించుకోలేక పోతున్నానంటూ కేరళకు చెందిన జోసిమల్ పీ జోస్ చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్ర శేఖర్ స్పందించారు. జోసిమల్ విజ్ఞప్తిపై ఆ రోజే యూఐడీఏఐ అధికారులు కొట్టాయం జిల్లాలోని కొమరకంలో ఆమె ఇంటికి వెళ్లి ఆధార్ నెంబర్‌ను నమోదు చేయించారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జోసిమల్‌లా ఎవరికైనా చేతివేళ్లు లేకపోయినా, ఉన్నా వేలి ముద్రలు సరిగా పడకపోయినా, ఇతర ఏదైనా వైకల్యం కారణంగా ముద్రలు వేయలేకపోయినా ఇతర ప్రత్యామ్నాయ బయోమెట్రిక్ విధానాల ద్వారా వారి వివరాలు నమోదు చేసుకోవాలని అన్ని ఆధార్ సర్వీస్ కేంద్రాలకు సలహా జారీ చేసినట్టు ఆయన చెప్పారు. వేలి ముద్రలు లభించని వారిని ఐరిస్ ద్వారా, ఐరిస్ నమోదు కాని వారి నుంచి వేలి ముద్రల ద్వారా బయోమెట్రిక్ నమోదు చేసుకుని ఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర మంత్రి చంద్రశేఖర్ ఆదేశించారు.

ఐఐటీయన్లకు నౌకరీ కరువు!

- ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో పడిపోతున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్లు
- 15 నుంచి 30 శాతం తగ్గుదల నమోదు
- ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యం వల్లే

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యార్థులు (ఫైల్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ఐఐటీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ అంటే ఓ పండుగ వాతావరణం నెలకొనేది. దేశ విదేశాలకు చెందిన పెద్ద పెద్ద కంపెనీలు ఐఐటీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం క్యూ కట్టేవి. ఇప్పుడా పరిస్థితుల్ని ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం తలకిందులు చేసింది. ఐఐటీల్లో డిసెంబర్ 1న ప్లేస్‌మెంట్ డ్రైవ్ మొదలుకాగా, వేలాది మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అనుకున్న విధంగా ఆఫర్లు రాలేదు. క్రితం ఏడాదితో పోల్చితే ఆఫర్ల సంఖ్యలో 15 నుంచి 30 శాతం తగ్గుదల నమోదైందని 'ఎకనామిక్ టైమ్స్' తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఉదాహరణకు ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో గత ఏడాది ఐదుమార్లు ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ చేపట్టగా..వచ్చిన ఉద్యోగ ఆఫర్ల సంఖ్య 1300. ఈసారి 7సార్లు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినా..ఆఫర్లు కేవలం 1181కు పరిమితమయ్యాయి. అలాగే ఐఐటీ-బీహెచ్‌యూలో గత ఏడాది నాలుగు రోజులపాటు ప్లేస్‌మెంట్ డ్రైవ్ చేపట్టగా ఆఫర్ల సంఖ్య 1000 దాటింది. కానీ ఈసారి ఆఫర్లు 850లోపే ఉన్నాయి.

ఒకరు లేదా ఇద్దరితో ముగించాయి

దేశవ్యాప్తంగా మొత్తం 23 ఐఐటీలున్నాయి. ఢిల్లీ, బాంబే, కాన్పూర్, మద్రాస్, ఖరగ్‌పూర్, రూర్కీ, గువహాటి, వారణాసి (బీహెచ్‌యూ) నగరాల్లోని ఐఐటీలు పేరొందినవి. ఇక్కడ ఈసారి జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ విద్యార్థుల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎంతో ప్రతిభా పాటవాలుంటే కానీ ఓ విద్యార్థి ఈ ఐఐటీల్లో సీటు పొందలేడు. అలాంటిది..కంప్యూటర్ సైన్స్ విభాగంలో సింగిల్ ఆఫర్ కూడా రాని విద్యార్థులున్నారు. 'సహజంగా 8 నుంచి 10 మందిని ఎంపిక చేసుకునే రిక్రూట్‌మెంట్ సంస్థలు ఈసారి ఒకరు లేదా ఇద్దరితో ముగించాయి. మరికొన్ని సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొన్నా, నియామకాలు జరపలేదు' అని ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి ఒకరు వాపోయారు.

మరో మూడు త్రైమాసికాలు ఇంతే

ముఖ్యంగా ఐటీ రంగంలో ఇప్పుడున్న పరిస్థితులు మరో మూడు త్రైమాసికాల వరకు కొనసాగుతుందని 'ఫౌండిట్' జాబ్ పోర్టల్ సీఈవో శేఖర్ గరిసా అన్నారు. ఐఐటీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఇంత దయనీయంగా మారడానికి కారణం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థికమాంద్యమేనని నిపుణులు చెబుతున్నారు. టెక్, కన్సల్టింగ్, సర్వీస్, ఐటీ..తదితర రంగాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. ఆర్థిక మార్పులు, భౌగోళిక రాజకీయ ఆర్థికపరమైన ఆందోళనలు, మాంద్యం భయాలు.. ఇవన్నీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెట్టాయని పేర్కొన్నారు.

పేరొందిన ఐఐటీల్లోనూ అంతే

ఢిల్లీ, బాంబే, కాన్పూర్, మద్రాస్, ఖరగ్‌పూర్, రూర్కీ, గువహాటి, వారణాసి..ఐఐటీల్లో ఈ ఏడాది ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరిగిన తీరు విద్యార్థుల్ని ఆందోళనకు గురిచేసింది. 'ఇక్కడ ఇంతకు ముందు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. ఫైనల్ ఇయర్ విద్యార్థికి ఉద్యోగం ఆఫర్ చేసేందుకు పలు కంపెనీలు పోటీ పడేవి. ఇప్పుడు ఇదంతా కూడా పూర్తిగా నెమ్మదించింది. కంపెనీలు గతంలో నిజంగానే నియామకాలు జరిపాయా? అన్న సందేహం విద్యార్థుల్లో కలుగుతున్నది' అని ఓ ఐఐటీ విద్యార్థి అన్నారు.

ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 25 శాతమే..

దేశంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ ప్లేస్‌మెంట్లు బాగా తగ్గిపోయాయి. తాజా రిక్రూమెంట్ పట్ల కంపెనీలు సుముఖంగా లేవని బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ కెరీర్ సెంటర్ సీనియర్ డైరెక్టర్ సంతానిల్ దాస్‌గుప్తా అన్నారు. ఎరోనాటిక్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్స్, ఎలక్ట్రానిక్స్..తదితర విభాగాల్లో రిక్రూట్‌మెంట్స్ గణనీయంగా పడిపోయాయని ఆయన తెలిపారు. గత ఏడాది 63 శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దక్కితే, ఈసారి అది 20-25 శాతానికి పరిమితమైందన్నారు. అమైటీ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ డిప్యూటీ డైరెక్టర్ అంజనీ కుమార్ భట్నాగర్ మాట్లాడుతూ, దాదాపు అన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇదే పరిస్థితి ఉందని, కేవలం 30 శాతం మంది విద్యార్థులకే ఆఫర్లు దక్కుతున్నాయని చెప్పారు.

మనం ఇతరుల మాట వినటం లేదు

సోషల్ మీడియా వల్ల అసహనం పెరుగుతున్నది: సీజేఐ

ముంబై: సమాజంలో ఇతరుల మాట వినే పరిణితి ప్రతి ఒక్కరిలో ఉండాలని సీజేఐ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. జీవితం ప్రతి దశలోనూ ఇతరుల మాట వినటం చాలా ముఖ్యమన్నారు. శనివారం ముంబైలో జరిగిన సింబయాసిస్ (డీమ్డ్) వర్సిటీ 20వ స్నాతకోత్సవంలో పాల్గొన్న సీజేఐ మాట్లాడుతూ 'మనం ఇతరుల మాట వినటం లేదు. మనం మన గురించి మాత్రమే ఆలోచిస్తున్నాం. జీవన ప్రయాణంలో మానవత్వం, ధైర్యాన్ని సహచరులుగా మార్చుకోవాలి' అని అన్నారు. సమాజంలో నేడు చాలామంది సంపన్న జీవితం కోసం ప్రయత్నిస్తున్నారని, ఇందులో తప్పేమీ లేదని, అయితే ఇది విలువలు, సూత్రాల విషయంలో రాజీపడకుండా ఉండాలన్నారు. శుక్రవారం ఓ అవార్డు కార్యక్రమంలో సీజేఐ మాట్లాడుతూ కుడి, ఎడమవాదులు, మధ్యేవాదుల 'పోలరైజేషన్' ప్రపంచవ్యాప్తంగా కనపడుతున్నదని, భారత్ ఇందుకు భిన్నమేమీ కాదని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వల్ల వివిధ వర్గాల మధ్య అసహనం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

- అయోధ్య రాముడు కొలువుదీరేది ఇక్కడే

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామాలయ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. శ్రీరాముడు కొలువు దీరనున్న గర్భగుడి ఫొటోను ఆలయ ట్రస్టు శనివారం విడుదల చేసింది. లేత గోధుమ రంగులో ధగ ధగ మెరిసిపోతున్న ఈ గర్భ గుడి నుంచి అతి త్వరలోనే రాముడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు.



జీవితాంతం పింఛన్ ఇవ్వండి

మోర్బీ వంతెన కేసులో గుజరాత్ హైకోర్టు ఆదేశం

అహ్మదాబాద్, డిసెంబర్ 9: గత సంవత్సరం గుజరాత్‌లోని మోర్బీలో వంతెన కూలిన ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఏదో కొంత సాయం అందజేసి చేతులు దులుపుకుందామంటే కుదరదని గుజరాత్ హైకోర్టు స్పష్టం చేసింది. ఓ పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ 'కొంత మంది చేతికి ఎదిగిన కొడుకులను పోగొట్టుకున్నారు. మరి కొందరు భర్తలను కోల్పోయి వితంతువులుగా మారారు. ఇన్నాళ్లు ఒకరిపై ఆధారపడి బతికిన వీళ్లంతా ఇప్పుడు ఎక్కడికి వెళ్లి పని చేసుకుంటారు. కాబట్టి కొడుకులను కోల్పోయిన వారికి జీవితాంతం పింఛన్ ఇవ్వండి. అలాగే వితంతువులైన వారికి ఉద్యోగం లేదా స్టైఫండ్ ఇవ్వండి. ఇలా చేయడం వల్ల వీళ్లంతా జీవితాంతం బతికే అవకాశముంటుంది' అని పేర్కొంది.

290 కోట్లు స్వాధీనం

- ఒడిశాలో ఐటీ దాడుల్లో బయటపడ్డ నోట్ల కట్టలు
- ఇంత మొత్తం దొరకడం దేశంలోనే ప్రథమం
- కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సంస్థల్లో సాగుతున్న సోదాలు

ఢిల్లీ/భువనేశ్వర్, డిసెంబర్ 9: ఒడిశాలోని మద్యం డిస్టిలరీలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు నాలుగో రోజూ తీవ్రతరం చేసింది. కాంగ్రెస్ ఎంపీ, అతని బంధువులకు చెందిన మద్యం వ్యాపార సంస్థలపై జరిగిన ఈ దాడుల్లో నగదు కట్టలు బయటపడుతూనే ఉన్నాయి. శుక్రవారం వరకు రూ.225 కోట్లు పట్టుబడగా, శనివారం నాటికి ఆ మొత్తం రూ.290 కోట్లకు చేరినట్టు ఐటీ డీజీ సంజయ్ బహదూర్ తెలిపారు. ఈ మొత్తం ఇంకా పెరగవచ్చన్నారు. ఐటీ శాఖ జరిపిన దాడుల్లో ఒకేసారి ఇంత మొత్తంలో పట్టుబడటం దేశంలో ఇదే ప్రథమం. స్వాధీనం చేసుకున్న డిజిటల్ డాక్యుమెంట్ల పరిశీలనకు హైదరాబాద్ నుంచి 20 మంది అధికారులను రప్పిస్తున్నారు. నిర్విరామంగా పని చేస్తుండటంతో కౌంటింగ్ మిషన్లు కూడా మొరాయించాయి. దీంతో వేరే బ్యాంకులు, సంస్థల నుంచి మిషన్లు తెప్పించారు. పట్టుబడిన మొత్తం సొమ్ములో బొలంగీర్ జిల్లా సుదాపరలో ఒక మద్యం కంపెనీలో ఉన్న 8 అల్మారాల్లో 230 కోట్ల నగదు దొరికిందని, మిగతా సొమ్ము టిటాగర్, సంబల్‌పూర్, రాంచీలలో లభించాయన్నారు. ఇందులో జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు సంస్థలు కూడా ఉన్నట్టు ఐటీ అధికారులు తెలిపారు. ప్రధానంగా బల్దేయో సాహు ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉన్న బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ (బీడీపీఎల్)పై ఐటీ దాడులు కొనసాగాయి. ఇది ఎంపీకి చెందినదే అన్న ఆరోపణలున్నాయి. కాగా ఐటీ దాడులను ఒడిశాలోని అధికార బీజేడీ స్వాగతించింది. కాంగ్రెస్ అవినీతి దుకాణం తెరిచిందని బీజేపీ విమర్శించింది.

ఒకే దూరం.. రెండు రకాల చార్జీలు

భువనేశ్వర్: ఒడిశాలోని భద్రక్, పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ మధ్య దూరం 181 కిలోమీటర్లు. అయితే ఈ రెండు పట్టణాల మధ్య నడిచే ప్యాసెంజర్ రైలులో చార్జీ మాత్రం రెండు విధాలుగా ఉన్నది. ఒక ప్రయాణికుడు ఖరగ్‌పూర్ నుంచి భద్రక్ వెళ్లాలంటే రూ.40 అవుతుంది. అదే దూరం ఉండే భద్రక్ నుంచి ఖరగ్‌పూర్ వెళ్లాలంటే మాత్రం ఆశ్చర్యకరంగా దాదాపు రెట్టింపుగా రూ.75 టికెట్ తీసుకోవాల్సి వస్తున్నది. కొవిడ్ సమయంలో పెంచిన రైలు చార్జీలను తర్వాత ఈస్టు కోస్ట్ రైల్వే అధికారులు సరిదిద్దకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఎస్ఈఆర్ అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఈసీఆర్ అధికారులు స్పందిస్తూ.. ఈ అంశం పరిశీలనలో ఉన్నదని, రైలు చార్జీ మార్పుపై ప్రతిపాదనలను రైల్వే బోర్డుకు పంపామని అన్నారు.

4 కోట్ల మంది బాలింతలకు దీర్ఘకాలిక సమస్యలు

న్యూఢిల్లీ : బిడ్డకు జన్మనిచ్చిన తల్లుల్లో అనేక మంది సుదీర్ఘ కాలంపాటు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ఇటువంటి బాధితులు ఏటా దాదాపు 4 కోట్ల మంది వరకు ఉంటున్నట్లు తెలిపింది. బిడ్డకు జన్మనిచ్చినప్పటి నుంచి 8 వారాల తర్వాత సెక్స్‌లో పాల్గొన్నపుడు నొప్పితో బాధపడే వారు 35 శాతమని, 32 శాతం మంది నడుము కింది భాగంలో నొప్పితో బాధపడుతున్నారని తెలిపింది. 8-31 శాతం మంది అనూహ్య మూత్ర విసర్జనతో, 9-24 శాతం మంది ఆందోళనతో, 11-17 శాతం మంది మానసిక ఒత్తిడితో బాధ పడుతున్నట్లు వెల్లడించింది. ఈ ఆరోగ్య సమస్యలు కొందరిలో కొన్ని నెలలపాటు, మరికొందరిలో కొన్ని సంవత్సరాల పాటు ఉంటున్నట్లు తెలిపింది.

వరద కష్టాలకు జాలీతో తెర

- నిమిషంలో 10 వేల లీటర్ల నీటిని ఎత్తిపోయవచ్చు
- లోతట్టు ప్రాంతాలకు ప్రయోజనకరం

బెంగళూరు, డిసెంబర్ 9: అది ఆగస్టు 2019. కర్ణాటక వ్యాప్తంగా కుండపోత వానలు. వరదల కారణంగా 61 మంది మరణించారు. 15 మంది జాడ తెలియకుండాపోయింది. రూ. 35 వేల కోట్ల మేర ఆస్తినష్టం సంభవించింది. రాజధాని బెంగళూరు సహా రాష్ట్రంలోని 22 జిల్లాలు నీటమునిగాయి. అయితే, బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో మాత్రం ఒక్క నీటి చుక్క కూడా నిల్వ లేదు. కారణం.. సబ్ సర్ఫేస్ టెక్నాలజీ.

ఏమిటీ సబ్ సర్ఫేస్ టెక్నాలజీ?

భారీ వర్షాలు, వరదల కారణంగా భూమిపై నిలిచిపోయే నీటిని భూమి అడుగున ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గాల ద్వారా బయటకు పంపించే సాంకేతికతనే 'సబ్-సర్ఫేస్ టెక్నాలజీ' అంటారు.

ఎలా పనిచేస్తుంది?

రెండు అడుగుల విస్తీర్ణంలో చిల్లులతో కూడిన జాలీని నిర్మిస్తారు. దీనికి సెన్సర్లు ఉంటాయి. దీని తలుపులు మూసి ఉంటాయి. భూమి లోపల రెండు, మూడు అడుగుల లోతులో గొట్టాలతో ఈ జాలీని అనుసంధానం చేస్తారు. వరద నీరు పెరిగినపుడు ఈ సెన్సర్లు యాక్టివేట్ అయి, జాలీ తలుపులు తెరుచుకుంటాయి. వరద నీరు జాలీలోకి చేరుతుంది, ఈ నీటిని గొట్టాల ద్వారా జలాశయాలు, చెరువులకు పంపిస్తారు.

నిమిషంలో ఎంత నీటిని ఎత్తిపోస్తుందంటే?

వరద నీరు వచ్చినపుడు ఒక్కో జాలీ ద్వారా నిమిషానికి 10 వేల లీటర్ల నీటిని ఎత్తిపోయవచ్చునని, ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించడానికి ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని నిపుణులు చెప్పారు. అమెరికాలోని గోల్ఫ్, బేస్‌బాల్, ఫుట్‌బాల్ స్టేడియంలలో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని తెలిపారు.

శత్రు కదలికలపై ఏఐతో ఆర్మీ నిఘా!

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో భారత ఆర్మీ కీలక నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తున్నది. శత్రువుల సైనిక మోహరింపుపై నిఘా పెట్టేందుకు కృత్రిమ మేధ సాయం తీసుకొనే యోచనలో ఉన్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా ఆర్మీ ఏఐ ఆధారిత దేశీయంగా అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగించనున్నదని తెలిపాయి. ఈ కొత్త సాంకేతికత సరిహద్దుల వెంబడి శత్రు దేశాల సైన్యం మోహరించిన ఆయుధాలు, యుద్ధ వాహనాలు, ఇతర యుద్ధ పరికరాల ఎలక్ట్రానిక్ పరమైన వివరాలను సేకరిస్తుందని, తద్వారా భవిష్యత్తులో మనం చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించుకోవడంలో సహకరిస్తుందని వివరించాయి. శాటిలైట్లు, రాడార్లు ఆధారంగా ఏఐ సాఫ్ట్‌వేర్ డాటా సేకరిస్తుందని పేర్క